

# పసిడిమనసులు - షర్మిల



## హీరో భిరామాయణం

**ఇంటర్ ఫస్ట్ ఇయర్లో చేరినప్పుడు** సీనియర్ ఇంటర్ , డిగ్రీ వాళ్ళు కమల్ హాసన్ అంటే పడిచచ్చి పోయేవారు. మరో చరిత్ర సినిమా అప్పుడే వచ్చింది. పైగా మొత్తం సినిమా మా వైజాగ్లోనే తీసింది. ఇక మగ పిల్లలందరూ కమల్ హాసన్ లాగా మీసాలు , బెల్ ప్యాంట్లు , హిప్పీ కటింగ్లు. అతని డూప్ గా వాళ్ళు చక్కగా పనికొస్తారు.

సాక్షాత్తూ కమల్ హసన్ నడిచొచ్చినట్టే వూగుతూ నడిచేవారు. సీనియర్ ఇంటర్ కి వచ్చాకా నేను కమల్ హాసన్ కి అరివీర భయంకర ఫ్యాన్ ని అయిపోయాను. ఇంకే హీరో సినిమా అతని సినిమాకి సాటి రాదని నా గట్టి నమ్మకం. ఈ పిచ్చి ఎంత వరకూ అంటే ఏ డబ్బింగ్ సినిమా కమల్ ది వచ్చినా ఆ సినిమాకి తీసుకెళ్ళమని ఇంట్లో పోరు.

నా గోల పడలేక కళ్యాణరాముడు, దొంగ దొర ఇంకేంటో... ఏంటో ... పేరూ ఊరూ లేని సినిమాలకి తీసికెళ్ళేదాన్ని. నా పిచ్చి అభిమానానికి మా ఇంట్లో వాళ్ళు బలై పోయారు.

మా నాన్న దొంగ దొర సినిమాకి నాతో వచ్చి "నీకు వాడంటే ఇష్టమైతే ఏదిబడితే అది చూడమని అర్ధం కాదు, కాస్త బాగున్న సినిమాలు చూడు" అని సలహా ఇచ్చారు.

"మనం చూడందే, బాగుందో లేదో ఎట్టా తెలుస్తుంది అయినా కమల్ హసన్ సినిమాలో వుంటే ఇక బాగోకపోవటం ఏంటి?" అని ఎదురు ప్రశ్న వేశాను.

ఈలోగా ఎర్రగులాబీలు సినిమా వచ్చింది. కానీ నాన్న ససేమిరా పంపనన్నారు. అది ఏ సర్టిఫికెట్ సినిమా. అయితే పాటలు భలే వుండేవి .

ఎవరో సినిమా చూసిన వాళ్ళు చెప్పిన కధ విని పోన్లే వెళ్ళకపోయినా పర్లేదనుకున్నా. ఎందుకంటే అందులో కమల్ విలన్ అట !

ఆ విధంగా ఆ పిచ్చి కొనసాగుతూండగా మా మన్నాన (పెద్దనాన్న ) పుట్టిన రోజు నాతో గడపాలని వచ్చాడు. అప్పుడే 15 ఏళ్ళు నిండి 16 లోకి అడుగు పెట్టాను. ఏప్రిల్ 24 నా పుట్టిన రోజు. అప్పటికి కమల్ హాసన్ అందమైన అనుభవం సినిమా వచ్చింది.

పుట్టిన రోజు నాడు కమల్ హాసన్ సినిమా చూడడం కన్నా ఇంకేం కావాలి !

పాత దేవదాసు ఏదో హాల్లో అడుతోంది. మన్నాన్న ఆ సినిమాకి వెళ్దామని మొదలెట్టాడు. ఆ కథ, నటులు, దర్శకుడి గొప్పదనం నాకు తెలియాలని తెగ తాపత్రయ పడ్డాడు.

అసలు వినిపించుకునే స్టేజ్ లో నేను వుంటేగా !

" అసలు నువ్వు  అందమైన అనుభవం  చూడకపోతే నీకు కమల్ హాసన్ గొప్పదనం ఎట్లా తెలుస్తుంది? పద నాన్న ఎల్దాం ! " అని గడ్డం పట్టుకుని బతిమాలాను .

ఇక చూస్కోండి సినిమా చూస్తానే తిట్లందుకున్నాడు .

" ఆ అవతారం ఏంటి ? ఆడు హీరోనా ! ఆ మీసాలేంటి , భుజాల వరకూ ఆ జుట్టేంటి ?  అని గోల .

" ఆహా మన రామారావు ఒడ్డూ పొడుగూ , నాగేశ్వరరావులా ముచ్చటైన మొహం లేకపోతే మానే బక్క పీసు మొహమేసుకుని సినిమా హీరో అంట ! తయారయ్యాడు ..." అని మన్నాన తిరిగి బార్లపూడి వెళ్ళే రోజు వరకూ తిట్లేనాయె !

" నాన్నా నాకు నచ్చాడు ! నీకు నచ్చే భానుమతికి వంకలు పెడితే అప్పుడు నా బాధేంటో అర్ధమవుతుంది " అనేశాను .

" ఆ... నువ్వు వొంక పెట్టడానికి ఆ నాటి నటుల్లో ఏం దొరకదులే "అన్నాడు ధీమాగా !

పోన్లే అని మా మన్నాన్నని వదిలేశా !

ఇంకొన్నాళ్ళకి ఆకలిరాజ్యం సినిమా వచ్చింది.  నాకు పెద్ద పండగొచ్చినట్టయ్యింది .

ఎందుకంటే కమల్ హాసన్, శ్రీదేవి ఇద్దరూ ఇష్టమే ... శ్రీశ్రీ అంటే ఆరాధన.  టెంత్ చదివేటప్పుడే ఏదో వీక్లీ వాళ్ళు 10 రూపాయిలు పంపితే శ్రీశ్రీ ఫోటో పంపుతామంటే తెప్పించుకున్నాను కూడా.

ఇంకో పక్క బాలచందర్ డైరెక్షన్ ఇన్ని కలిసిన సినిమా ఆత్రంగా చూసేసాను. మర్నాడు పొద్దున అమ్మ ఉప్మా చేసి వేడిగా వుంది తినమని ప్లేట్ లో పెట్టి ఇచ్చింది. తిందామని స్పూన్ కలిపానో లేదో తిండి లేని నిరుద్యోగ కమల్ హాసన్ గుర్తొచ్చాడు. అంతే వెంటనే ప్లేట్ అమ్మకే ఇచ్చేశాను. అమ్మకి అర్ధమైపోయింది

"నేను ఇవ్వాళ అన్నం కూడా తినను" అన్నాను.

కానీ ఆకలి మండిపోతాంది. ఇదేంట్రా నాయనా ఒక్క పూట టిఫిన్ గంట అలస్యమైతేనే ఆకలేస్తంటే పాపం ఉద్యోగం లేనాళ్ళ గతేంటి అని అనుకున్నాను. 10 గంటలు దాటింది .

ఈ లోగా ఇంటికి బాబాయి వచ్చాడు. అమ్మ నేను ఇవ్వాళ అన్నం కూడా తినన్నానని చెప్పింది .

మా బాబాయ్ " ఒసే పిచ్చి మొహమా ! మీ కమల్ హాసన్ పెద్ద పెద్ద హోటల్స్ లో ముప్పొద్దులా తిని సినిమాలో తిండి లేనట్టు ఏక్షన్ చేశాడే. నువ్వు కూడా సుబ్బరంగా తిని బాధపడు! అని గీతోపదేశం చేశాడు .

ఇంకేముంది అసలే ఆకలిరాజ్యం నేను .

వెంటనే ప్లేటుడు ఉప్మా తినేసి " అమ్మా ! ఇవాళ అరిటికాయ వేపుడు చేసి రసం పెట్టమ్మా ! చాలా ఆకలిగా వుంది ..." అని వాటి రుచి వూహించుకుంటూ లొట్టలేశా .

మా బాబాయ్ చెప్పినట్టు కమల్ హాసన్ ఆకలి గురించి ముందు తిని ఆ తర్వాత బాధపడ్డాను.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments